క్లుప్తంగా

డీసీసీ అధ్యక్షుడిగా అవకాశం కల్పించాలని వినతి



ఏఐసీసీ పరిశీలకుడు బిశ్వరంజన్‌కు వినతి పత్రం అందిస్తున్న దైద రవీందర్

నకిరేకల్ : డీసీసీ అధ్యక్షుడిగా తనకు అవకాశం కల్పించాలని కోరుతూ ఏఐసీసీ పరిశీలకుడు బిశ్వరంజన్‌మహంతికి శనివారం టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దైద రవీందర్ వినతి పత్రం అందించారు. నల్లగొండకు వచ్చిన ఆయనను కలిసి దళిత మాదిగ సామాజిక వర్గం నుంచి తనకు అవకాశం కల్పించాలని కోరినట్లు ఆయన స్థానిక విలేకరులకు తెలిపారు.

జవాన్ కుటుంబానికి రూ. 2 లక్షలు



మురళీనాయక్ తల్లిదండ్రులకు రూ.2 లక్షలు అందిస్తున్న మేఘారెడ్డి

మునుగోడు: కొద్ది నెలల క్రితం భారత్–పాక్ యుద్ధంలో 14 మంది పాక్ ముష్కరులతో పోరాడి వీరమరణం పొందినా మురళీనాయక్ కుటుంబానికి కొంపల్లికి చెందిన వెదిర పూలమ్మ ఫౌండేషన్ చైర్మన్ మేఘారెడ్డి రూ.2 లక్షల ఆర్థిక సాయం అందించారు. హైదరబాద్‌లోని ఉప్పల్ స్టేడియంలో వీర జవాన్ల కుటుంబ సభ్యులకు ఎలైయిట్ క్రికెట్ లీగల్ టోర్నమెంట్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందించారు. మేఘారెడ్డి కూడా తన వంతుగా మురళీనాయక్ కుటుంబానికి ఆర్థిక సాయం అందించి దేశభక్తిని చాటుకున్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు మాస్కులు పంపిణీ



పారిశుద్ధ్య కార్మికులకు మాస్కులు పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

కట్టంగూర్ : లయన్స్ క్లబ్ ఆఫ్ కట్టంగూర్ కింగ్స్ ఆధ్వర్యంలో శనివారం పారిశుద్ధ్య కార్మికులకు బ్లౌజ్‌లు, మాస్కులు, పండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ ఉపాధ్యక్షుడు రెడ్డిపల్లి సాగర్ మాట్లాడుతూ పరిశుభ్రమైన సమాజ నిర్మాణం కోసం పనిచేసే పారిశుద్ధ్య కార్మికులను ప్రతి ఒక్కరూ గౌరవించాలన్నారు. కార్యక్రమంలో క్లబ్ ఉపాధ్యక్షుడు కల్లూరి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి గుడిపాటి శివప్రసాద్, సహాయ కార్యదర్శి బసవోజు వినోద్‌కుమార్, కోశాధికారి పి.రాములు, సభ్యులు పాల్గొన్నారు.

హక్కుల సాధనకు ఉద్యమించాలి



మహాసభల కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఐద్వా ప్రతినిధులు

నకిరేకల్ : మహిళలు తమ హక్కుల సాధనకు ఉద్యమించాలని ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రభావతి కోరారు. ఐద్వా మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ శనివారం నకిరేకల్ పట్టణంలో కరపత్రాలను పంపిణీ చేశారు. నేటికీ మహిళలను చిన్నచూపు చూసే వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు చెన్నబోయిన నాగమణి, పట్టణ అధ్యక్షురాలు పన్నాల శశికళ, ప్రతినిధులు పాల్గొన్నారు.

చిన్నారులకు ఆట వస్తువుల పంపిణీ



ఆట వస్తువులు అందిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

నల్లగొండ: జిల్లా కేంద్రంలోని పానగల్ అంగన్‌వాడీ కేంద్రం చిన్నారులకు శనివారం నేలటి రాము సహకారంతో లయన్స్ క్లబ్ నల్లగొండ నోబుల్ ఆధ్వర్యంలో ఆట వస్తువులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్‌బాధ్యులు మాట్లాడుతూ క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు వెంకట్‌రెడ్డి, నాగేశ్వర్‌రావు, అయ్యప్పరెడ్డి, బుర్రి కృష్ణశేఖర్, కరుణాకర్ రెడ్డి, నవనీత పాల్గొన్నారు.

సాగునీరు రోడ్డుపాలు



నకిరేకల్ రోడ్డుపై ప్రవహిస్తున్న వరద నీరు

- డీ–40కి పిల్ల కాల్వలు లేక సాగునీరు వృథా
- ప్రమాదాల బారిన పడుతున్న వాహనదారులు

తిప్పర్తి : మండల కేంద్రంలోని మర్రిగూడం ఎక్స్‌రోడ్డు నుంచి నకిరేకల్ వెళ్లే రోడ్డుపై డీ–40 కాల్వ నీరు ప్రవహిస్తుండడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. డీ–40 కాల్వ నుంచి వచ్చిన సబ్ కెనాల్‌కు పిల్ల కాల్వలను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయకపోవడంతో కాల్వ నీరు రోడ్డుపై వృథాగా పారుతోంది. వాహలు వెళ్లే సమయంలో నీటి ప్రవాహానికి జారి పడే ప్రమాదం ఉంది. దాంతో పాటు రోడ్డు వెంట పాదచారులు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. సంబంధిత అధికారులు డీ–40 కాల్వకు పిల్ల కాల్వలను ఏర్పాటు చేయడంతో పాటు రోడ్డుకు కల్వర్టును నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

దారి కనిపిస్తలేదు.. దయచూపరూ..



రోడ్డుకు ఇరువైపులా దట్టంగా పెరిగిన చెట్లు

- వాయిలపల్లి రోడ్డును కమ్మేసిన కంప చెట్లు

ఘట్టుప్పల్: మండల కేంద్రం నుంచి యాదాద్రి భువనగిరి జిల్లా వాయిలపల్లి గ్రామానికి వెళ్లే రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లు, ఇతర చెట్లు ఏపుగా పెరిగి రోడ్డును కమ్మేశాయి. దాంతో వాహన దారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డుకు ఇరువైపులా చెట్లు పెరగడంతో ఆ మార్గం ఇరుకుగా మారింది. ముందు నుంచి వచ్చే వాహనాలు కనిపించని పరిస్థితి నెలకొంది. ఒకేసారి రెండు వాహనాలు వచ్చినా ఒకటి పోయే వరకు రెండో వాహనం పక్కన నిలుపాల్సి వస్తున్నది. ఘట్టుప్పల్ నుంచి వాయిలపల్లి గ్రామానికి మూడు కిలోమీటర్ల మేర ఉన్న రోడ్డు చెట్లతో ఇరుకుగా మారడంతో భారీ వాహనాలు లచ్చమ్మగూడెం, చిల్లాపురం గ్రామాల మీదుగా 10 కిలోమీటర్ల దూరం అదనంగా ప్రయాణించి వెళ్లాల్సి వస్తున్నది. సంబంధిత అధికారులు చొరవ తీసుకొని రోడ్డుని కమ్మేసిన చెట్లను తొలగించి తమ సమస్య పరిష్కరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

విక్రమ్‌రెడ్డికి ప్రముఖుల నివాళి

శాలిగౌరారం/నకిరేకల్:శాలిగౌరారం మండలంలోని పెర్కకొండారం గ్రామానికి చెందిన కాంగ్రెస్‌పార్టీ నాయకుడు శానాల యుగంధర్ రెడ్డి కుమారుడు విక్రంరెడ్డి(24) నకిరేకల్లో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యేలు వేముల వీరేశం, మందుల సామేల్ శనివారం విక్రంరెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో నకిరేకల్ మున్సిపల్ చైర్ పర్సన్ చౌగోని రజితాశ్రీనివాస్‌గౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రేగట్టే మల్లిఖార్జున్‌రెడ్డి, నార్కట్‌పల్లి మాజీ ఎంపీపీ సూదిని రవీందర్‌రెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్ పాదూరి శంకర్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు అన్నెబోయిన సుధాకర్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కందాల సమరంరెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు అయితగోని వెంకన్న ఉన్నారు.



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్

కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి



అయిటిపాములలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

- ఎమ్మెల్యే వేముల వీరేశం

కట్టంగూర్ /నార్కట్‌పల్లి : ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. శనివారం కట్టంగూర్, నార్కట్‌పల్లి మండలాల్లోని పలుగ్రామాల్లో పీఏసీఎస్, ఐకేపీ, ఎఫ్‌పీఓ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతులు దళారులకు ధాన్యం అమ్మి మోసపోవద్దన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏ గ్రేడ్ ధాన్యానికి రూ.2,389, సాధారణ రకానికి రూ.2,369 మద్దతు ధర అందిస్తుందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గుత్తా మంజుల, డీఆర్‌డీఓ పీడీ శేఖర్‌రెడ్డి, తహసీల్దార్ పుష్పలత, డీపీఎం మోహన్‌రెడ్డి, డీఎస్ఓ వెంకటేశ్వర్లు, మాజీ జెడ్పీటీసీలు సుంకరబోయిన నర్సింహ, మాద యాదగిరి, ఏపీఎం రాములు, ఏఓ గిరిప్రసాద్, నార్కట్‌పల్లిలో మాజీ ఎంపీపీ పబ్బతిరెడ్డి వెంకట్‌రెడ్డి, డీపీఎం మోహన్‌రెడ్డి, ఏపీఎం జీడికల్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఐతరాజు యాదయ్య, డైరెక్టర్ ధార యాదయ్య, ఎంపీడీఓ ఉమేశ్, తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు, నాయకులు దూదిమెట్ల సత్తయ్య, గాయం శ్యాంసుందర్‌రెడ్డి, మురళి, భరత్ పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

- నకిరేకల్ మున్సిఫ్ కోర్టు సివిల్ జడ్జి ఆరిఫ్

నకిరేకల్ : విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని నకిరేకల్ మున్సిఫ్‌కోర్టు జడ్జి షేక్ ఆరిఫ్ అన్నారు. నకిరేకల్ నారాయణ స్కూల్ విద్యార్థులు శనివారం స్థానిక షిర్డీ సాయి కల్యాణ మండపంలో నిర్వహించిన మాస్టర్ ఓరాటర్ సీజన్–6 ఫినాలే వేడుకలల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశం, సమాజంపై విద్యార్థులకు సంపూర్ణ అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఎంఈఓ మేక నాగయ్య,, ప్రిన్సిపాల్ ఆర్.నరేశ్, విద్యాసంస్థల డీజీఎం రమణారెడ్డి, ఏజీఎంలు శ్రీనివాస్‌రెడ్డి, రమేశ్‌రెడ్డి, క్రాంతి పాల్గొన్నారు.



వేడుకలను ప్రారంభిస్తున్న సివిల్ జడ్జి ఆరిఫ్

స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి



నార్కట్‌పల్లిలో కాంగ్రెస్ బాకీ కార్డును పంపిణీ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నకిరేకల్ : ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయని కాంగ్రెస్ పార్టీకి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నలగాటి ప్రసన్నరాజ్ కోరారు. నకిరేకల్ మండలం చందంపల్లి గ్రామంలో శనివారం కాంగ్రెస్ బాకీ కార్డులను ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 22 నెలలు కావస్తున్నా ఇచ్చిన హామీలు అమలు చేయలేదన్నారు. కాంగ్రెస్ విస్మరించిన వాటిని బాకీ కార్డుల రూపంలో ప్రజలకు వివరిస్తున్నట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో నాయకులు వంటిపాక సుందర్, చౌగోని శంకర్, చెరుకు వెంకటాద్రి, పాలడుగు ఏసు, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి: బీఆర్ఎస్ నాయకులు శనివారం మండల కేంద్రంలో కాంగ్రెస్ బాకీ కార్డులను ఇంటింటికీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ యువజన విభాగం మండలాధ్యక్షుడు పుల్లెంల వెంకట్, నాయకుడు పుల్లెల మహేశ్, పట్టణాధ్యక్షుడు నడింపల్లి మహేశ్, మండల పరిషత్ కోఆప్షన్ మాజీ సభ్యుడు వాజిద్ అలీ, బీఆర్ఎస్ మండల నాయకులు పాల్గొన్నారు.

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి

మిర్యాలగూడ టౌన్ : గర్భిణులు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నజీమా బేగం అన్నారు. శనివారం పట్టణంలోని గాంధీనగర్‌లో పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా చిరుధాన్యాలతో పాటు ఆహార పదార్థాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ఎల్లమ్మ, భారతి, వాణి, సైదమ్మ, హెల్పర్లు రమణ, ఎల్లమ్మ, రాధిక, కవిత, ఏఎన్ఎం మాధవి, ఆశా వర్కర్లు లక్ష్మి, గీత, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

రసాయన వ్యర్థాల తరలింపు అడ్డగింత

చిట్యాల: మండలంలోని పిట్టంపల్లి గ్రామ శివారులో ఎవరో పడేసిన రసాయన వ్యర్థాలను తిన్న గొర్రెలు మృతి చెందాయి. దాంతో ఈ విషయమై జీవాల పెంపకందారులు జిల్లా కాలుష్య నియంత్రణ మండలి అధికారులకు ఫిర్యాదు చేశారు. కాలుష్య నియంత్రణ మండలి అధికారులు శుక్రవారం రాత్రి పిట్టంపల్లి వద్ద ఉన్న రసాయన వ్యర్థాల పౌడర్‌ను లారీల్లో నింపి తరలించేందుకు యత్నించగా పెంపకందారులు వారిని అడ్డుకున్నారు. రసాయన వ్యర్థాల పౌడర్‌ను ఏపరిశ్రమ వారు పడేశారనే విషయాన్ని నిర్ధారించకుండా, వారిపై చర్యలు తీసుకోకుండా పౌడర్‌ను తరలించొద్దని డిమాండ్ చేశారు. దాంతో జీవాల పెంపకందారులు అధికారుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న చిట్యాల పోలీసులు అక్కడికి చేరుకొని వారిని వారించారు. రసాయన వ్యర్థాలను తరలించేందుకు తీసుకొచ్చిన లారీని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అధికారుల విచారణ చేసిన అనంతరం పూర్తి వివరాలు తెలుపుతామని ఎస్ఐ మామిడి రవికుమార్ తెలిపారు.



పిట్టంపల్లి శివారులో పడేసిన రసాయన వ్యర్థాలు

నేడు బాలగోపాల్ వర్ధంతి సభ

నకిరేకల్ : మానవ హక్కుల వేదిక నేత బాలగోపాల్ వర్ధంతి సభను హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం నిర్వహించనున్నట్లు వేదిక ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు అక్కెనపల్లి వీరస్వామి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా బాలగోపాల్ రచించిన రాజ్యాంగం ఎలా చదువాలి అనే పుస్తకాన్ని కూడా ఆవిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నల్లగొండ: జిల్లా కేంద్రంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏడీఈ వేణుగోపాలచార్యులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నల్లగొండలో 11 కేవీ లైన్ షిఫ్టు, రోడ్డు విస్తరణ పనులు చేపడుతున్నందున మిర్యాలగూడరోడ్డు, ప్రకాశంబజార్, మాన్యంచెల్క, ఎస్ఆర్‌గార్డెన్, రహమత్‌నగర్, అన్సారీకాలనీల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

పెన్షనర్లకు పీఆర్‌సీ అమలు చేయాలి



ప్రమాణ స్వీకారం చేస్తున్న కమిటీ సభ్యులు

నల్లగొండ టౌన్: పెన్షనర్లకు పీఆర్‌సీ, డీఆర్‌లను ప్రభుత్వం త్వరగా అమలు చేయాలని పెన్షనర్ల సంఘం జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ బి.మోహన్‌రావు డిమాండ్ చేశారు. నల్లగొండలోని సంఘం భవనంలో శనివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. పెన్షనర్లకు నగదు రహిత వైద్యాన్ని అమలు చేయాలన్నారు. అనంతరం కొత్తగా ఎన్నికైన మండల కార్యవర్గంతో ఎన్నికల అధికారి కోట్ల రామలింగం ప్రమాణం స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా 40 మంది పెన్షనర్ల జన్మదిన వేడుకలు నిర్వహించి జ్ఞాపికలను అందించారు. సమావేశంలో సంఘం వైస్ ప్రెసిడెంట్ ఎస్.ఆంజనేయులు, సంఘం మండలాధ్యక్షుడు గజవెల్లి సత్యం, కార్యదర్శులు యాదవాసుదేవ్ ,జిల్లా పుల్లయ్య, జి.సుధాకర్ ,ఎం శేషారెడ్డి పాల్గొన్నారు.

బీసీల రిజర్వేషన్లు పెంచే వరకు ఉద్యమం

నల్లగొండ టౌన్: బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేసే వరకు ఉద్యమం కొనసాగిస్తామని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు అయితగోని జనార్దన్‌గౌడ్ అన్నారు. రిజర్వేషన్ల సాధనకు ఈ నెల 14న జరిగే రాష్ట్ర బంద్‌కు సంబంధించిన పోస్టర్లను శనివారం నల్లగొండలోని అమరవీరుల స్తూపం వద్ద పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ విద్యావంతుల వేదిక జిల్లా అధ్యక్షుడు పందుల సైదులు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు గండిచెరువు వెంకన్నగౌడ్, కర్నాటి యాదగిరి, అనంత నాగరాజు, కన్నబోయిన రాజు యాదవ్, సతీశ్‌కుమార్, గడగోజు విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాజాపేటతండాలో పశువైద్య శిబిరం

మర్రిగూడ : మండలంలోని రాజాపేటతండాలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో శనివారం పశు వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 12 గేదెలకు, నాలుగు ఆవులకు చూడి పరీక్షలు, 14 గేదెలకు గర్భకోశ వ్యాధి చికిత్సలు, ఆరు ఆవులకు గర్భకోశ చికిత్సలు, 16 గేదెలకు సాధారణ చికిత్సలు చేసినట్లు మండల పశువైద్యులు పి.సురేందర్, యమున తెలిపారు.

ఆర్థిక సాయం

త్రిపురారం : మండల కేంద్రానికి చెందిన ఇల్లందుల సోమమ్మ అనారోగ్యంతో ఇటీవల మృతిచెందింది. శనివారం మాజీ ఎంపీపీ గౌరవ సలహాదారు అనుముల శ్రీనివాస్ రెడ్డి మృతురాలు సోమమ్మ ఇంటికి వెళ్లి మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రూ. 5వేలు కుటుంబ సభ్యులకు అందజేశారు. అనుముల భరత్ రెడ్డి, ఆలంపల్లి జానయ్య పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లను అడ్డుకుంటున్నది బీజేపీ : సీపీఎం



సమావేశంలో మాట్లాడుతున్న చినవెంకులు

కేతేపల్లి : బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలుకాకుండా బీజేపీ అడ్డుకుందని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బొజ్జ చినవెంకులు అన్నారు. శనివారం మండలకేంద్రంలో నిర్వహించిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజలు ఎదుగకుండా, వారికి రాజ్యాధికారం దక్కకుండా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్ర పన్నిందన్నారు. రిజర్వేషన్ బిల్లును రాష్ట్ర శాసనసభ ఆమోదించినా, గవర్నర్ వ్యవస్థను తన చేతిలో పెట్టుకుని బిల్లు ఆమోదం పొందకుండా కేంద్ర ప్రభుత్వం అడ్డుకుంటున్నదన్నారు. బీసీలపై చిత్తశుద్ధి ఉంటే రాష్ట్రంలో ఉన్న కేంద్ర మంత్రులు బీసీ రిజర్వేషన్ల బిల్లును ఆమోదింపజేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి చింతపల్లి లూర్థుమారయ్య, నాయకులు కోట లింగయ్య, లకపాక రాజు, వీరబోయిన సొడయ్య పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి

కేతేపల్లి : ప్రస్తుతం రైతులు వరి చేలను కోస్తున్న దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి రైతులను ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని ఇనుపాముల ఐకేపీ కేంద్రంలో రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మూర్ఖపు చర్యలతో రైతులు, ప్రజలను తీవ్ర ఇబ్బందులు పెడుతుందన్నారు. గత బీఆర్ఎస్ పాలనలో రైతులు రాజుగా వెలుగొందారన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం వల్ల ప్రస్తుతం రైతులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. బీసీల 42 శాతం రిజర్వేషన్ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం నాటకాలాడుతున్నదని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించక పోవడంతో పల్లెల్లో సర్పంచులు లేక గ్రామాల అభివృద్ధి కుంటుపడిందన్నారు. ఆయన వెంట నకిరేకల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొప్పుల ప్రదీప్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, నాయకులు ఉన్నారు.



ధాన్యం పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి

బీసీలకు మేలు చేసే ఉద్దేశం కాంగ్రెస్‌కు లేదు

- బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకన్న

నాంపల్లి: బీసీ సమాజానికి మేలు చేసే ఉద్దేశం కాంగ్రెస్ పార్టీకి లేదని బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి మండల వెంకన్న అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేవలం రాజకీయ లబ్ధికోసం, సోనియా గాంధీ వద్ద భేష్ అనిపించుకోవాలనే ఆతృతే తప్ప బీసీలను అందలం ఎక్కించాలనే ఉద్దేశం సీఎం రేవంత్‌రెడ్డికి లేదన్నారు. బీసీ రిజర్వేషన్‌పై హైకోర్టులో వచ్చిన తీర్పుకు పూర్తి బాధ్యత కాంగ్రెస్ పార్టే వహించాలన్నారు. కాంగ్రెస్ పార్టీపై ప్రజలకు నమ్మకం పోయిందని, రానున్న స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు డిపాజిట్లు కూడ రావన్నారు. గ్రామాల్లో బీజేపీ గెలుపు ఖాయమన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు దాచేపల్లి నర్సింహ, పకీరు మోహన్‌రెడ్డి, మిర్యాల వెంకటేశం, పాశం శ్రీనివాస్‌రెడ్డి, పిన్నింటి నరేందర్‌రెడ్డి, పాలగోని శ్రీకాంత్, నాంపల్లి సతీశ్ పాల్గొన్నారు.

సీజేఐపై దాడి వెనుక శక్తులను బయటపెట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగార్జున

- కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగార్జున

నల్లగొండ టౌన్: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై మతోన్మాది దాడి చేసేయత్నం చేయడం దేశ చరిత్రలో చీకటి రోజని, దీని వెనుక ఉన్న శక్తులను ప్రభుత్వం బయట పెట్టాలని కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాలడుగు నాగార్జున డిమాండ్ చేశారు. శనివారం నల్లగొండలో నిర్వహించిన సామాజిక, ప్రజా సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీజేఐపై దాడికి యత్నించిన రాకేశ్‌కుమార్‌ను అరెస్టు చేయాలని, అతడి వెనుక ఉన్న ఆర్ఎస్ఎస్, సంఘ్ పరివార్‌కు చెందిన వారిని కూడా బయటపెట్టాలన్నారు. దళిత మేథావి జస్టిస్ గవాయ్ సుప్రీంకోర్టు చీఫ్‌గా ఉండడం బీజేపీకి నచ్చడం లేదన్నారు. అంబేద్కర్ రాజ్యాంగ ధర్మాన్ని కాపాడుకోవాల్సిన సమయం వచ్చిందన్నారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చినపాక లక్ష్మీనారాయణ, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లం మహేశ్, నాయకులు కొండా వెంకన్న, దండంపల్లి సత్తయ్య, బొడ్డుపల్లి వెంకటేశ్, గుండాల నరేశ్, కట్టా లింగస్వామి పాల్గొన్నారు.

అడుగడుగునా గుంత..నడవలేక చింత

మునుగోడు: మండలంలోని ఎల్గలగూడెం గ్రామానికి వెళ్లే ప్రధాన రోడ్డు గుంతల మయంగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలకు గ్రామానికి వెళ్లే మట్టి రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. వాటిలో మట్టి పోసి పూడ్చక పోవడంతో కొద్దిపాటి వర్షం కురిసినా గుంతల్లో నీరు చేరి నీటి కుంటను తలపిస్తున్నాయి. దాంతో కనీసం పాదచారులు నడిచేందుకు కూడా వీలులేని పరిస్థితి నెలకొంది. గుంతల్లో నీరు నిలువడంతో రోడ్డుపై ఎక్కడ గుంత ఉంది, ఎక్కడ సాఫీగా ఉందో తెలియక వాహన దారులు అవస్థలు పడుతున్నారు. రాత్రి వేళల్లో గుంతలు కనిపించక పోవడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటి కైనా సంబంధిత అధికారులు స్పందించి గ్రామానికి పక్కా రోడ్డు ఏర్పాటు చేయాలని, అప్పటి వరకు గుంతలను పూడ్చి చదును చేయాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.



ఎల్గలగూడెం వెళ్లే రోడ్డుపై గుంతల్లో నిలిచిన వర్షపు నీరు